క్లుప్తంగా

మండలంలో తేలికపాటి జల్లులు

కందుకూరు: మండల పరిధిలో గురువారం ఉదయం నుంచి వాతావరణం చల్లగా మారడంతో పాటు సాయంత్రం నుంచి తేలికపాటి వర్షం కురిసింది. దీంతో బయటికి వచ్చి సాధారణ పనులు చేసుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. మరోపక్క ఎన్నికల ప్రచారాలు చేసుకోవడానికి ఆయా పార్టీల నాయకులకు తిప్పలు తప్పలేదు. నిత్యం పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున లౌడ్ స్పీకర్లు ఉన్న వాహనాలతో గ్రామాల్లో తిరిగి ఓట్లు వేయాలని కోరుతూ ప్రచారాలను ఊదరగొట్టే వారు. కానీ వాతావరణం కారణంగా ఉదయం నుంచి ప్రచారాలు మూగబోయాయి.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



తుక్కుగూడలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల నుంచి పార్టీశ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా తుక్కుగూడ నుంచి బహిరంగ సభకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబితమ్మను గెలిపించండి

మహేశ్వరం ఎమ్మెల్యేగా సబితారెడ్డిని మరోసారి గెలిపించాలని కౌన్సిలర్ బదావత్ రవి నాయక్ కోరారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్

చైతన్యపురి: తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ ఆధ్వర్యంలో ఈవీఎంల కమిషనింగ్ నిర్వహించారు. జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ సథురప్పన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఆర్ఓ రవీందర్‌కుమార్, ఏఆర్ఓలు అరుణ కుమారి, దశరథ్ ఎంఆర్ఓ సునీత, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలి

ఆ పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్‌లో సుధీర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

చైతన్యపురి: అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలిపించాలని ఎల్బీనగర్ ఆ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని పలు డివిజన్లలోని కాలనీలలో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాలనీవాసులు, బస్తీవాసులు సుధీర్‌రెడ్డికి అడుగడుగునా మంగళహారతులు, డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెప్పుకోవటానికి ఏమీ లేవని, ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దన్నారు. గుంపులుగా వచ్చే ఇతర నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రధాన సమస్యలు పరిష్కరించామని, మిగతా సమస్యలను కూడా దశల వారీగా పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంపై అవగాహన లేని వారు చెప్పే మాయమాటలను నమ్మి మొసపోవద్దన్నారు. ప్రజాసేవలో పాలు పంచుకునే వారికి ఓటు వేయాలని, మరోసారి తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రచారంలో కొప్పుల విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, ధనలక్ష్మి, వెంకట్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, జగదీష్‌గౌడ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్యపురిలో..

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మద్దతుగా చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్‌లోని న్యూ మారుతీనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎల్బీనగర్ అభివృద్ధిపై కరపత్రాలను పంచిపెట్టి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుల చంద్రశేఖర్‌రెడ్డి, తులసీదాస్, పవన్, గట్టు శ్రీనివాస్, కృష్ణమూర్తి, విజయరంగా, తిరుమల్‌రెడ్డి, వీరన్న యాదవ్, ప్రభాకర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు



మహేశ్వరం: ప్రచారంలో భాగంగా కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేఎల్లార్

విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ దూకుడు

- 'హస్తం'తోనే అన్ని వర్గాలకు మేలు
- ఆ పార్టీ మహేశ్వరం అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- ఆరు గ్యారెంటీలతో ప్రచార పర్వం
- బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తనదైన శైలిలో నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపై నడిపిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లలతో విస్తృతంగా తిరుగుతూ తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు ఎకరానికి రూ.15 వేల పంట పెట్టుబడి సాయం, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం, మహిళలకు రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ఉన్నత చదువులకు విద్యార్థులకు రూ.5 లక్షల సహాయం, గృహజ్యోతి పథకం ద్వారా మహిళలకు రూ.2500 చెల్లింపు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తామని కేఎల్లార్ హామీ ఇస్తున్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ముందంజలో దూసుకుపోతుంది. తక్కువ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ వారిని చైతన్యం చేస్తున్నారు. గతంలో కేఎల్లార్ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు, లీడ్ ఇండియా ద్వారా చేసిన పనులను యువతకు తెలియజేస్తూ ముందుకెళ్తున్నారు. ప్రచారంలో ఛలోక్తులు విసురుతూ అందరితో కలివిడిగా మాట్లాడి ఓటర్లను ఆకర్షిస్తున్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ గెలవడంతో పాటు రాష్ట్రంలో వచ్చేది తమ ప్రభుత్వమే అని ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ప్రచారానికి వెళ్లిన కేఎల్లార్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. జనాలు తండోపతండాలుగా ప్రచార ర్యాలీలలో పాల్గొంటూ ఆయనకు మద్దతు నిలుస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ మైనార్టీలతో ఆత్మీయ సమ్మేళన సభలు, యువ గర్జన, వివిధ కుల సంఘాల సమ్మేళనాలు నిర్వహిస్తూ ప్రచారం జోరు పెంచారు. గ్రామాల్లో లీడ్ ఇండియా టీమ్, కేఎల్లార్ టీమ్ సభ్యులు స్థానిక నేతలను సమన్వయం చేస్తూ పార్టీ ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఇతర నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తున్నారు. కేఎల్లార్ కుటుంబ సభ్యులు భార్య, కుమారులు, బంధువులు కూడా మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని విజయమే లక్ష్యంగా కేఎల్లార్ పని చేస్తున్నారు. తనను గెలిపిస్తే మహేశ్వరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని కేఎల్లార్ ప్రజలకు హామీ ఇస్తున్నారు.

వర్షంలోనే నేతల ప్రచారం

తుక్కుగూడ: మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఎల్లార్‌కి మద్దతుగా మున్సిపాలిటీలోని రావిర్యాలలో ఆ పార్టీ నాయకులు గురువారం వర్షంలోనే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరుగుతూ హస్తం గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాండు, రంగారెడ్డి, రాజు, భిక్షపతి, గోవర్ధన్‌రెడ్డి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ఆర్‌కేపురం డివిజన్ ఆ పార్టీ సీనియర్ నాయకురాలు తమలపాకుల హర్షలత పేర్కొన్నారు. గురువారం అల్కాపురి, శ్రీరామకృష్ణపురం కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. మన పిల్లల భవిష్యత్తు మారాలంటే రాష్ట్రంలో మార్పు కావాలన్నారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారిన సబితారెడ్డికి ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు శకుంతల, సోని, శిరీష చౌదరి, నిర్మలారెడ్డి, సుచరిత చౌదరి, నాగవల్లి, ప్రేమవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మీర్‌పేట: ప్రజా సంక్షేమం కోసం పాటుపడే కాంగ్రెస్‌కే ఓటు వేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ప్రజలకు కోరారు. గురువారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, మైత్రిపురం కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, శ్రీశైలం, గంగమ్మ, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, సంతోష్, వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: వర్షంలో తడుస్తూ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలో ప్రచారం చేస్తున్న హర్షలత



మీర్‌పేట: ప్రచారంలో భాగంగా డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

నాలుగోసారి ఆశీర్వదించండి

ఇబ్రహీంపట్నం: నాలుగోసారి ఆదరించి గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అభ్యర్థించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, ఇబ్రహీంపట్నం, శేరిగూడ, సీతారాంపేట గ్రామాల్లో కిషన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం పట్నం మున్సిపాలిటీలో తాగేందుకు మంచినీళ్లు, సదుపాయాలు లేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రూ.40కోట్లతో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటి అందిస్తున్నామని, అంతర్గత రోడ్ల నిర్మాణం, 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో నిషేధం ఉండడంతో సొంత జాగ, ఇంటి కల నేరవేరలేదన్నారు. అయితే ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంతో సొంతింటి కలను సాకారం చేయబోతున్నామని వివరించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళిత, బీసీ, మైనార్టీబంధు తదితర పథకాల తో అర్హులను ఆదుకోనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే వంట గ్యాస్ సిలిండర్ రూ.400లకే ఇస్తామని తెలిపారు.

అవసరమైతే భూమి అమ్ముకుంటా

'ఆ భగవంతుడు నా తండ్రికిచ్చిన ఆస్తి ఉంది. అవసరమైతే నా ఖర్చులకు రెండు మూడు ఎకరాల భూమిని అమ్ముకుంటానే తప్పా.. అవినీతికి పాల్పడను' అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో విజ్ఞతతో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి, కౌన్సిలర్లు నీలం శ్వేత, యాచారం సుజాత, మంద సుధాకర్, నల్లబోలు మమతతోపాటు పార్టీ నాయకులు అల్వాల వెంకట్‌రెడ్డి, యాచారం రవీందర్, తాళ్ల మహేశ్‌గౌడ్, కేవీ రమేశ్‌రాజు, జెర్కొని రాజు, కంచకట్ల భాస్కర్, ముత్యాల చిన్న, కొంద్రు ప్రవీణ్, వేణుగోపాల్‌రావు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డి గెలుపు ఖాయం

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రమేశ్‌గౌడ్, పాశ్య భాషలు ధీమావ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కిషన్‌రెడ్డి గెలిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. రూ. వేలాది కోట్ల నిధులతో అన్ని గ్రామాలను అభివృద్ధి చేశారని తెలిపారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కిషన్‌రెడ్డి మంత్రి అవుతాడని పేర్కొన్నారు.

గులాబీ దళపతికి సాదరంగా..

సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హెలికాప్టర్ వచ్చిన సీఎం కేసీఆర్‌కు హెలీపాడ్ వద్ద మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డితో ఎన్నికల హడావుడి ఎలా ఉందని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలి అని కాసేపు సరదాగా ముచ్చటించారు. సీఎంకు స్వాగతం పలికినవారిలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

- మహేశ్వరం



కేసీఆర్ మాయమాటలు నమ్మొద్దు



దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్‌నగర్‌లో మాట్లాడుతున్న పురందేశ్వరి



మహేశ్వరం: పెండ్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

- బీఆర్ఎస్ హామీలు నీటి మూటలు
- బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి
- శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం

దిల్‌సుఖ్‌నగర్: నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలను మోసగిస్తున్న కేసీఆర్‌ను నమ్మవద్దని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురి చౌరస్తా, ఎన్టీఆర్‌నగర్‌లో బీజేపీ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా స్థానిక కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్‌తో వేరుపడిన తెలంగాణను కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను నిండా ముంచారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయమైందని, కమీషన్‌లకు తలొగ్గి నాసిరకంగా నిర్మించారన్నారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుండా ప్రజలకు అన్యాయం చేశారన్నారు. తుక్కుగూడలో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్ రూమ్‌లు ఒక వర్గానికి కేటాయించి నియోజకవర్గంలో అర్హులైన పేదలకు సబితారెడ్డి అన్యాయం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన సబితారెడ్డికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ మాట తప్పారని గుర్తు చేశారు. స్థానికుడైన శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాములుయాదవ్, కరుణ, సిద్ధు, సురేష్, సుదర్శన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

బీసీ బిడ్డను ఆదరించాలి

మహేశ్వరం: బీసీ బిడ్డ అయిన అందెల శ్రీరాములు యాదవ్‌కు ఓటు వేసి అసెంబ్లీకి పంపించాలని బీజేపీ రాష్ట ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మాసారం చంద్రయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాణిక్యమ్మగూడ, పెండ్యాల, చిన్న తూప్ర, మన్సాన్‌పల్లి గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి అందెలకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరంలో కాషాయ జెండా ఎగురుతుందన్నారు. నియోజకవర్గం నుంచి బీసీ బిడ్డ అందెల పోటీ చేస్తున్నారని, ఆయనకు ఓటు వేసి అసెంబ్లీకి పంపించాలన్నారు. అవినీతి పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీతోనే సుస్థిర, సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందన్నారు. కార్యక్రమంలో చిన్న తూప్ర గ్రామ సర్పంచ్ రఘుపతి గౌడ్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊరూరా జన జాతర



బీఆర్ఎస్ ప్రచారం

- జెండాలు, ఎజెండాలు వేరు
- జనం మాత్రం వారే
- ఎటూ తేలని ఓటరు నాడి
- తలపట్టుకుంటున్న అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ తేదీ సమీపిస్తున్న తరుణంలో ఊరువాడ ప్రచారం హోరెత్తుతోంది. ఇంటింటి ప్రచారంలో పాటు ప్రధాన నాయకుల రోడ్ షోలు, బహిరంగ సభలతో ఒక్క నిమిషం ఖాళీ లేకుండా బిజీ షెడ్యూల్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నా రు. అయితే అన్ని పార్టీలు ప్రజలను ప్రచార అస్త్రా లుగా వాడుకుంటున్నారు. ఏ పార్టీ అయినా బలంగా ఉందంటే.. దానికి కారణం జనమే. అభ్యర్థుల గెలుపోటముల్లో వీరిదే కీలక పాత్ర. వీరిని ఓటర్లగానే కాకుండా ప్రచారానికి కూడా వాడుకుంటున్నాయి.

రసవత్తరంగా 'పట్నం' రాజకీయం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలై న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి పదిగంటల వరకు ప్రచారం సాగిస్తున్నారు. అయితే ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లుగా తలపడుతున్నారు. ప్రచారంలో బీజేపీ కాస్త నెమ్మదిగా ఉన్నా.. ఆ పార్టీ బలంగా ఉన్న గ్రామాల్లో జోరుగా ప్రచారం చేస్తున్నారు. సీపీఎం కూడా తామెక్కడ తక్కువ కాదు అన్నట్లుగా ప్రచారం సాగిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లిన కనీసం 1,000 మందికి తగ్గకుండా ప్రజలు ప్రచారంలో ఉండేలా అన్ని పార్టీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులను కూడా ప్రచారంలో వాడుకుంటున్నాయి.

గందరగోళంలో అభ్యర్థులు

నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంతో పాటు పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల్లో పార్టీలతో సంబంధం లేకుండా అన్ని పార్టీల ప్రచార కార్యక్రమాల్లో విరివిగా ప్రజలు పాల్గొంటున్నారు. పూటకు రూ.200 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నారు. ఉదయం ఓ పార్టీ తరఫున ప్రచారం చేస్తే సాయంత్రం మరో పార్టీ జెండా మోస్తున్నారు.

కాంగ్రెస్ సభను జయప్రదం చేయండి

చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈ నెల 25న కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపే లక్ష్యంగా నిర్వహిస్తున్న బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సభ ఏర్పాట్లను గురువారం ఏఐసీసీ కార్యదర్శి సందీప్, కాంగ్రెస్ పరిశీలకుడు మునీల్, కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, వంశీచంద్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ గెలుపు కోసం మల్లికార్జున్‌ఖర్గే, ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తారని తెలిపారు. సభకు అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్‌పై తీవ్ర వ్యతిరేకత

రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ నియంత పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఏఐసీసీ కార్యదర్శి సందీప్ అన్నారు. కర్నాటక రాష్ట్రంలో ఎన్నికల సమయంలో అప్పటి బీజేపీ ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత కనిపించిందని అదేవిధంగా తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంపై అంతకంటే ఎక్కువగా వ్యతిరేకత కనిపిస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ఆయన చెప్పారు. సమావేశంలో ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, కృష్ణనాయక్, అప్పం శ్రీను, విజయ్, బాబా తదితరులు పాల్గొన్నారు.